చాకలి గెడ్డకు మోక్షం



చాకలి గెడ్డ బాటంలో క్రషర్ బుగ్గిని వేసి చదును చేసిన ప్రాంతం

రూ.1.89 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం

చురుగ్గా సాగుతున్న పనులు

మాణిక్యాంబ కాలనీవాసులకు తొలగనున్న ఇబ్బందులు



మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని ప్రమాదాలకు అడ్డాగా మారిన చాకలి గెడ్డకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. మురళీనగర్ పరిసరాల్లో అనేక గెడ్డలు ఉన్నప్పటికీ చాకలి గెడ్డ అత్యంత పొడవైనదిగా చెప్పవచ్చు. ఎన్జీజీవోస్ కాలనీ మాధవధార కొండ ఎగువ నుంచి ఈ గెడ్డ ప్రవహిస్తూ జాతీయ రహదారి సమీపంలోని ఊర్వశి కూడలి వద్ద కలుస్తుంది. దీన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడం వల్ల దశాబ్దాలుగా మాణిక్యాంబ కాలనీతోపాటు ఇతర ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై గత డిసెంబర్‌లో 'గెడ్డ పోటు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. నిధులు మంజూరు చేసి పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇవి చురుగ్గా సాగుతున్నాయి.

గతంలో భయానక ఘటనలు

చాకలి గెడ్డ చుట్టూ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురళీనగర్ పరిధిలో అతి పెద్ద గెడ్డ ఇదే కావడం విశేషం. దీనికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడం వల్ల మాణిక్యాంబ కాలనీలోని గెడ్డకు ఇరువైపులా నివాసులు అవస్థలు పడుతున్నారు. చాకలి గెడ్డ పేరు చెప్పగానే గతంలో ఇక్కడి ప్రజలు ఎదుర్కొన్న ప్రమాదకర సంఘటనలు తలచుకుని భయంతో వణికిపోతారు. గతంలో ఒకసారి భారీ వరదలకు ఈ గెడ్డ కల్వర్టు గోడ కూలిపోవడమే కాకుండా వరద నీటి తాకిడికి కల్వర్టు రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయి నివాస ప్రాంతాల్లోని ఇళ్లలోకి మురుగు నీరు పోటెత్తింది. నాటి నరకయాతనను ఈ ప్రాంతీయులు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. కుటుంబాలు రోడ్డు పాలయ్యాయి. ఈ ప్రాంతంలో బాటం కాంక్రీట్‌తో అభివృద్ధి చేసిన జీవీఎంసీ మాణిక్యాంబ కాలనీ దిగువ 200 మీటర్ల భాగాన్ని అలాగే వదిలేశారు. వర్షాలు కురిసేటప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయంతో బతుకుతున్నారు. ఈ గెడ్డ దుస్థితిపై ప్రచురించిన కథనానికి ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు

జోరుగా గెడ్డ పనులు

తీసుకున్నారు. గెడ్డ అభివృద్ధికి రూ.1.89 కోట్ల నిధులను జీవీఎంసీ మంజూరు చేసింది. ఈ మేరకు పనులకు శ్రీకారం చుట్టి గెడ్డలో పేరుకుపోయిన చెత్త, భారీ వృక్షాల దుంగలు, పూడికను పూర్తిగా తొలగించారు. ఒక వైపు నీరు పోయే ఏర్పాట్లు చేసి మిగతా భాగంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. గెడ్డ మధ్య భాగం 220 మీటర్ల పొడవునా డస్ట్ ఫిల్లింగ్ చేశారు. దీనిపై ప్లెయిన్ సిమెంట్ కాంక్రీట్ వేస్తారు. ఇది కుదురుకున్న తర్వాత రీ ఇన్‌ఫోర్స్‌డ్ బాటం కాంక్రీటు వేస్తారు. ప్రస్తుతం శిథిలమైన గెడ్డ రక్షణ గోడ స్థానంలో బాటం కాంక్రీట్ నుంచి 2.7 మీటర్ల ఎత్తు వరకు కొత్త గోడ నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న ఇరుకైన సిమెంట్ రోడ్డును వెడల్పు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇది పూర్తయితే మాణిక్యాంబ కాలనీ వాసుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. గెడ్డ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



గెడ్డ పొడవునా రక్షణ గోడ నిర్మించాల్సిన ప్రాంతం



మాణిక్యాంబ కాలనీలో వెడల్పు చేయాల్సిన రహదారి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సీతంపేట: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. తొలి రోజు సెకెండ్ లాంగ్వేజ్ పరీక్ష జరిగింది. రామాటాకీస్, సీతంపేట మెయిన్ రోడ్డులోని బుల్లయ్య కాలేజీ, బీవీకే కాలేజీ, శ్రీవిశ్వ కళాశాల, చైతన్య కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హాల్ టికెట్ నంబర్ బట్టి ఏ రూమ్ కేటాయించారో చూసుకుని ప్రశాంతంగా పరీక్ష రాశారు.

వికసించిన మే పుష్పాలు



ముస్లిం తాటిచెట్లపాలెంలో వికసించిన మే ఫ్లవర్స్

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలో మే పుష్పాలు వికసించాయి. ఎండీ ఆరిఫ్ హుస్సేన్ తన ఇంటి మేడపై పెంచుతున్న మొక్కల్లో ఒకేసారి రెండు మే ఫ్లవర్స్ కనువిందు చేశాయి. మరో పుష్పం వికసించడానికి సిద్ధంగా ఉంది. 2003లో సబ్బవరం సమీపంలోని ఒక నర్సరీ నుంచి తెచ్చిన దుంప కుండీలో ఈ మొక్క నాటినట్లు హుస్సేన్ తెలిపారు. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో పువ్వులు వికసించి ఆకర్షిస్తున్నాయన్నారు. మే ఫ్లవర్స్‌ను చూడటానికి చుట్టుపక్కల వారు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

క్లుప్తంగా

జోన్-5 పీజీఆర్ఎస్‌కు నాలుగు వినతులు



అర్జీలు పరిశీలిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అర్జీలను స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్త్ యూసీడీకి 01. రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నక్కవానిపాలెంలో అన్నదానం



ఆలయంలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు, దాతలు

తాటిచెట్లపాలెం: పౌర్ణమి సందర్భంగా సోమవారం నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, భక్తుల నామగోత్రాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు, పేదలకు అన్నదానం జరిపారు. కార్యక్రమాలలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు రామారావు శర్మ, మహేష్, దాతలు రంగల శ్రీనివాసరావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన వేసవి శిబిరం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్, వనమాలి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. విద్యార్థులకు పాట్ పెయింటింగ్, మౌల్డింగ్ ఆర్ట్ వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు క్లబ్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభాతి, పి.సూర్యనారాయణ, ప్రశాంతి పార్కు ఉపాధ్యక్షుడు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 48వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.2,51,419 చెక్కులను అందించారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తర కన్వీనర్ సురేష్‌బాబు, గొర్లె అప్పారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పైడిమాంబకాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. టిడ్కో ఇళ్లకు ఆనుకుని ఉన్న రోడ్లు, కాలువలు అపరిశుభ్రంగా మారడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం వ్యర్థాలమయం అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో కార్మికులు కాలనీలో వ్యర్థాలు, డ్రైనేజీల్లో పూడికలు తొలగించారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే మార్గం



మహనీయులకు నివాళులర్పిస్తున్న బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శనం తదితరులు

సీతంపేట: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, అసమానతలు నిరోధానికి బౌద్ధమే ఏకైక మార్గమని భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం గౌతమ బుద్ధుడి 2,569వ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, సామ్రాట్ అశోకుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ బుద్ధుడు వేల ఏళ్ల కిందటే అశాంతికి పరిష్కార మార్గం చూపారన్నారు. మనిషి కోరికలపై అదుపు ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని బుద్ధుడు బోధించినట్టు తెలిపారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలకు పరిష్కారం పంచశీల మార్గమే సరైనదని అంబేడ్కర్ సూచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్టీఎల్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.రేణుకుమార్, రచయిత బండి సత్యనారాయణ, బీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి పి.వి.సుబ్బారావు, ఎం.మల్లయ్యరాజు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి ఉత్సవాలు



బుద్ధ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు, బర్మా కాందిశీకులు

కంచరపాలెం: స్థానిక బర్మాక్యాంప్ బౌద్ధాలయంలో జిల్లా మహాబోధి సొసైటీ ప్రతినిధి గునుపూడి బాబులు ఆధ్వర్యంలో సోమవారం 2569వ బుద్ధ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ప్రభాకర్ బౌద్ధ పుంగవులతో కలిసి గౌతమ్ బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బర్మా-ఆంధ్ర కాందిశీకుల కేంద్ర సంఘం వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు బర్మా అర్జునరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమని ప్రభాకర్ కొనియాడారు. ఈ సందర్భంగా 47వ వార్డు అధ్యక్షుడు గుణపూడి అరుణబాబు, జై భీమ్ సంస్థ నగర కన్వీనర్ కోన ప్రకాష్, డాక్టర్ రమేష్, కొప్పిశెట్టి ప్రసాద్‌ల చేతుల మీదుగా 100 మంది వృద్ధులకు దుస్తులు, రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్య, అరుణ, హనుమంతు, సాయిచరణ్, ఆనంద్‌బాబు, శంకర్, రాజు, నాగరాజు, భాను నరేష్, సోమేశ్వరి, ముసలయ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతోనే ఆవిష్కరణలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

మురళీనగర్: సృజనాత్మక ఆలోచనల నుంచే ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరావు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లలు శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సమయంలో తాము నేర్చుకున్న అంశాలకు సంబంధించి ప్రశ్నించే స్వభావాన్ని అలవరచుకోవాలన్నారు. అప్పుడే వారిలోని అంతర్గత సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. యాపిల్ పండు చెట్టు నుంచి కిందకి ఎందుకు పడిందనే న్యూటన్ మెదడులో పుట్టిన ప్రశ్న నుంచే గురుత్వాకర్షణ శక్తి అనే భౌతిక శాస్త్ర భావన ఆవిష్కృతమైందని వివరించారు. ఎందరో శాస్త్రవేత్తల జీవిత చరిత్రను ఆయన తెలియజేశారు. నిత్య జీవితంలో భౌతిక శాస్త్రం వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పేద ముస్లిం పిల్లలకు వైద్య సేవలు



సున్తీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న సీరత్ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: పేద ముస్లిం పిల్లలకు సీరత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఉచిత ఖత్నా(సున్తీ) వైద్య శిబిరం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాంతాల్లోని పేద ముస్లింల పిల్లలకు ఉచితంగా సున్తీ చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి అనుభవజ్ఞులైన డాక్టర్ మౌలాలి బృందాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. సున్తీ అనంతరం చిన్నారులకు మందులు, హెల్త్ డ్రింక్స్ అందజేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి మధ్యాహ్న భోజనాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకులు మహ్మద్ రఫీ, మహ్మద్ అతహర్, కమిటీ సభ్యులు మెహబూబ్ షరీఫ్, ముస్తాక్ అహ్మద్, ఎస్కే అబ్దుల్ లతీఫ్, అహ్మద్ అలీ, మహ్మద్ రెహమతుల్లా, మునీర్‌ఖాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు నిల్..!

- వార్డుల్లో జోరుగా అనధికార అంతస్తులు
- కూటమి నాయకుల అండదండలతో నిర్మాణాలు
- ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తు



శ్రీనగర్‌లోని గెడ్డ బఫర్ జోన్‌లో నిర్మించిన భవనం

సీతంపేట: కూటమి నాయకుల అండదండలతో అనధికార అంతస్తులకు అడ్డు లేకుండా పోయింది. జీవీఎంసీ అనుమతులతో పనిలేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ ఆదాయాన్ని పరిరక్షించాల్సిన కూటమి నేతలు అక్రమ అంతస్తులకు కాపుకాస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని 49-38-20/ఏ డోర్ నంబర్‌లో సుమారు 380 గజాల్లో బీఏ నంబర్ 1086/4248/బీ/జెడ్3/ఏఈఎం/2023 నంబర్‌తో రివైజ్డ్ ప్లాన్‌కు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం స్టిల్ట్, జీ ప్లస్ 3 ఫ్లోర్స్ నిర్మాణం చేపట్టగా.. టీడీఆర్‌తో నాలుగో అంతస్తు నిర్మాణానికి గత నెలలో దరఖాస్తు చేశారు. ప్లాన్ అప్రూవల్ కాకుండానే నాలుగో అంతస్తు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేష్టలుడిగి చూస్తున్నారు.

అప్రూవల్ రాకుండానే అదనపు అంతస్తు

సాధారణంగా జీవీఎంసీ నుంచి అనుమతులు వచ్చాక ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. ఇక్కడ మాత్రం ప్లాన్‌కు అనుమతి రాకుండానే నాలుగో అంతస్తు నిర్మించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ సెక్రటరీ గౌరిని వివరణ కోరగా.. భవన యజమాని టీడీఆర్‌తో ప్లాన్‌కు దరఖాస్తు చేశారని, ప్రాసెస్‌లో ఉందని, ఇంకా అప్రూవల్ కాలేదని తెలిపారు. అప్రూవల్ కాకుండా అదనపు అంతస్తు నిర్మించినా చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నిస్తే.. అనుమతి వస్తుందని ధీమాగా సమాధానం చెప్పడం విశేషం. ప్లాన్ అప్రూవల్ కాకపోతే టీడీఆర్ రూపంలో జీవీఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతుందని, ఈ లోగా నిర్మాణం పూర్తిచేసి చేతులు దులిపేసుకుంటారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై స్థానిక కార్పొరేటర్ ముక్కా శ్రావణి వివరణ కోరగా.. వార్డులో జరుగుతున్న అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్లాన్ అప్రూవల్ కాకుండా ఎలా నిర్మాణానికి అనుమతిచ్చారో జోన్-2 టౌన్ ప్లానింగ్ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

నోటీసులిచ్చినా.. యథావిధిగా పనులు

జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురం రోడ్డులో ఆంధ్రా స్పోర్ట్స్ ఎదురుగా 49-51-6/1 ఇంటి నంబర్‌లో జీ ప్లస్ 2 పాత భవనంపై అనుమతి లేకుండా అదనపు అంతస్తు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోటీసులిచ్చి, శ్లాబ్‌కు కన్నం పెట్టి వెళ్లిపోయారు. కొద్ది రోజుల తర్వాత కన్నం పూడ్చి యథావిధిగా యజమాని పనులు పూర్తిచేశాడు.

గెడ్డ బఫర్ జోన్‌లో నిర్మాణం

27వ వార్డు శ్రీనగర్‌లో ఆంటీ మెస్ పక్కనున్న గెడ్డ బఫర్ జోన్‌లో భవన నిర్మాణం చేపట్టారు. గెడ్డ రిటైనింగ్ వాల్ నుంచి పదడుగుల బఫర్ జోన్ విడిచిపెట్టి ఇంటి నిర్మాణం జరగాల్సి ఉండగా.. గృహ యజమాని మాత్రం అలా చేయకుండా జీ ప్లస్ 2 ఇల్లు నిర్మించాడు. జోన్ పరిధిలో పలు చోట్ల అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధుసూదన్ మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి జీవీఎంసీ ఆదాయానికి గండిపడకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

కేజీహెచ్‌లో నర్సుల దినోత్సవం

మహారాణిపేట: ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా నర్సుల దినోత్సవాన్ని కేజీహెచ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్ కేక్ కట్ చేశారు. 0నర్సుల సేవలను వైద్యులు కొనియాడారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్న సీనియర్ హెడ్‌నర్సు మద్దిరాల ఇందిరకు పాడేరు గవర్నమెంట్ ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించడంతో ఆమెను అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు ఘనంగా సన్మానించారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.17.46 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 46 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించిన ఆదాయం కలిపి రూ.17,46,974 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు ఎం.నీలిమ, పి.శేఖర్‌బాబు పర్యవేక్షణలో దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని సుధా విద్యానికేతన్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్న వీరు రోజంతా సందడి చేశారు. నృత్య భారతి డ్యాన్స్ అకాడమీ చిన్నారుల ప్రదర్శన అలరించింది. చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జనార్దన్‌రావు దంపతులను, నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.